సంపుటి :02 సంచిక :2012 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 17 , అక్టోబర్ 2025

## బీసీ కోటా అంశంపై ప్రభుత్వానికి లేఖ రాశాం!

- ప్రభుత్వం మరోసారి కోటాను ఖరారు చేయాల్సి ఉంది..
- హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం
- ప్రభుత్వానికి రెండు వారాల గడువిచ్చిన న్యాయస్థానం

05






## కోటగుళ్లకు పూర్వ వైభవం తెస్తాం

- అభివృద్ధి కోసం రూ.55 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఆలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతాం
- జిల్లాకే తలమానికంగా కోటగుళ్లను నిలుపుతాం
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

03

## రేపు రాష్ట్రం బంద్


హైదరాబాద్ బీసీ సంఘాల ర్యాలీ

- హైదరాబాద్‌లో అఖిల పక్ష, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ముందస్తు ర్యాలీ
- పార్టీలు, సంఘాలకు అతీతంగా బంద్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపు

05

# ఆయుధం వీడిన ఆశన్న

- అరణ్యం వీడి జన జీవన స్రవంతిలోకి..
- స్వాగతించిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి
- ఆయనతో పాటు మరో 208 మంది పార్టీ సభ్యులు సరెండర్
- వీరిలో 110 మంది మహిళలే.. 153 తుపాకులు అప్పగింత



### నాలుగు దశాబ్దాల నక్సలైట్ ఉద్యమానికి స్వస్తి

మావోయిస్టు పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పార్టీ సెంట్రల్ కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 60 మంది పార్టీ సభ్యులతో కలిసి లొంగిపోయిన ఒకేరోజు వ్యవధిలో పార్టీకి చెందిన మరో అగ్రనేత ఆశన్న అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు ఛత్తీస్ గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం ఆ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో ఆశన్నతోపాటు మరో 208 మంది మావోయిస్టులు లొంగిపోయారు. తమ ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించారు. మొత్తం 153 తుపాకులు అప్పగించగా, లొంగిపోయినవాళ్లలో 110 మంది మహిళా మావోయిస్టులు ఉండడం గమనార్హం.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02





## ఏసీబీ గాలానికి చిక్కిన మత్స్యశాఖ అధికారులు

03

- మత్స్యకార సంఘంలో సభ్యత్వానికి లంచం డిమాండ్
- రూ.50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



## పనుల్లో వేగం పెంచాలి

### మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

– అక్షరదర్బార్, తాడ్వాయి

02

## ఆర్టీఐ చిట్యాల కన్వీనర్ గా రాంరెడ్డి నియామకం



అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండల ఆర్టీఐ కన్వీనర్ గా చింతకుంట రామయ్య పల్లె గ్రామానికి చెందిన ఏలేటి రాంరెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలకు తావులేకుండా అవినీతి అధికారులను ప్రశ్నించే గొంతుకనై పని చేస్తానని, పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని అనినారు. తన ఎంపికకు సహకరించిన జిల్లా కమిటీ సభ్యుడు చింతల కుమార్ యాదవ్, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే గండ్రకు సన్మానం

### సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముగ్గురు పిల్లలు ఉన్న వ్యక్తులు స్థానిక సంస్థలలో పోటీ చేయరాదు అనే నిబంధనను రద్దు చేసి, పోటీకి నిలబడొచ్చని చేసిన జీవోకు సహకరించిన ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి సత్కరించినట్లు మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, గుండెపరెడ్డి రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మట్టికి రవీందర్, సీనియర్ నాయకులు సిరిపురం కుమారస్వామి, కొర్రి సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.







# ఆయుధం వీడిన ఆశన్న

- నాలుగు దశాబ్దాల నక్సలైట్ ఉద్యమానికి స్వస్తి
- అరణ్యం వీడి జన జీవన స్రవంతిలోకి..
- స్వాగతించిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి
- ఆయనతో పాటు మరో 208 మంది పార్టీ సభ్యులు సరెండర్
- వీరిలో 110 మంది మహిళలే.. 153 తుపాకులు అప్పగింత

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: మావోయిస్టు పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పార్టీ సెంట్రల్ కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 60 మంది పార్టీ సభ్యులతో కలిసి లొంగిపోయిన ఒకేరోజు వ్యవధిలో పార్టీకి చెందిన మరో అగ్రనేత ఆశన్న అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు ఛత్తీస్ గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం ఆ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో ఆశన్నతో పాటు మరో 208 మంది మావోయిస్టులు లొంగిపోయారు. తమ ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించారు. మొత్తం 153 తుపాకులు అప్పగించగా, లొంగిపోయినవాళ్లలో 110 మంది మహిళా మావోయిస్టులు ఉండడం గమనార్హం.

### - అలిపిరి బ్లాస్ట్, ఐపీఎస్ ఉమేశ్ చంద్ర, మాధవరెడ్డి హత్యల వెనుక..

నాటి ఉమ్మడి వరంగల్ జిల్లా, ప్రస్తుత ములుగు జిల్లాకు చెందిన వెంకటాపురం గ్రామానికి చెందిన ఆశన్న అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు నలభై ఏళ్ల క్రితం నక్సలైట్ ఉద్యమంలోకి వెళ్లారు. అప్పుడు ఆయన వయస్సు 25 ఏళ్లు. ప్రస్తుతం ఆయన వయస్సు 60 ఏళ్ల వరకు ఉంటుంది. ఆయనపై అనేక కేసులున్నాయి. ఆయన తలపై రివార్డులూ ఉన్నాయి. బైరంగూడా అడవుల్లో ఆయన దశాబ్దాలుగా అండర్‌గ్రౌండ్‌గా జీవనం కొనసాగిస్తూ వచ్చారు. 2003లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడిపై అలిపిరిలో జరిగిన దాడి, టీడీపీ నేత, నాటి మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి, ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్ర హత్యలకు ఆయనే ప్రధాన సూత్రధారి అని ఇంటెలిజెన్స్ వర్గాలు భావించాయి.

### - చివరిసారి భావోద్వేగ ప్రసంగం

తప్పనిసరి పరిస్థితుల్లో మనం ఆయుధాలు వదిలిపెడుతున్నాం.. ఇది లొంగుబాటు కాదు.. జనజీవన స్రవంతిలో కలుస్తున్నాం. ఇప్పుడు ఎవరికి వారే తమ రక్షణ కోసం ఇప్పుడు పోరాటం చేసుకోవాల్సిన సందర్భం వచ్చింది. ఎవరైనా లొంగిపోవాలనుకుంటే నన్నుకాంటాక్ట్ చేయండి. సహచరులందరూ ఎక్కడవాళ్లు అక్కడే లొంగిపోవడం మంచిది.

### - తర్వాత ఎవరు?

మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న.. ఇక ఈ లొంగుబాటు పరంపరలో రేపు ఎవరా? అనే చర్చ నడుస్తోంది. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్, అశోక్, క్రాంతి.. లొంగిపోవ డానికి సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంక. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి ద్వారా ఆయన లొంగుబాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రకాశ్ స్వస్థలం ఒకప్పటి ఆదిలాబాద్ జిల్లా ప్రస్తుత మంచిర్యాల జిల్లా మందమర్రి. ఆయన తండ్రి సింగరేణి కార్మికుడు. 1982–84 మధ్య గో టు ది విలేజెస్ ఉద్యమం ద్వారా ప్రకాశ్ రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ తరఫున పోరాడారు. ఆపై మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. అయితే.. ఆయన కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలోనే ఆయన లొంగిపోయేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆయన సీఎం రేవంత్ రెడ్డి లేదా డీజీపీ శివధర్‌రెడ్డి లేదా స్థానిక పోలీసుల లొంగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే జనజీవన స్రవంతిలో కలుస్తున్నాం. జనజీవన స్రవంతిలో కలిసిపోయి ప్రజల కోసం పోరాటం చేస్తాం. ఉద్యమంలో అమరులైన వారందరికీ జోహార్లు. ఇకపై మన పోరాటం రాజ్యాంగానికి లోబడి కొనసాగాలి. మనం సాయుధ పోరాటానికి మాత్రమే విరమణ ఇచ్చాం. ఇకపై శాంతియుగ మార్గంలో పోరాటం చేద్దాం అని ఆశన్న పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లొంగిపోయే ముందు చివరిసారిగా తన సహచర మావోయిస్టులకు ఆయన భావోద్వేగ సందేశమిచ్చారు. శాంతి చర్చల కోసం ప్రజా సంఘాలు, మేధావులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదని, దీంతో సాయుధ పోరాటానికి విరామం ఇవ్వాలని నిర్ణయించుకోవాల్సి వచ్చిందని తెలిపారు.

### - తమ డిమాండ్లపైనా ప్రస్తావన

ఆశన్న ఈ సందర్భంగా తాము పెట్టిన ప్రధాన షరతులపై ప్రభుత్వ స్పందన గురించి కూడా మాట్లాడారు. తాము పెట్టిన డిమాండ్లపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించాయని తెలిపారు. మా పార్టీ, అనుబంధ సంఘాల్లో పని చేశారనే ఆరోపణలపై పోలీసులు జైళ్లలో పెట్టిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశామని, అలాగే మూలవాసీ బచావో మంచ్ సంస్థపై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశామన్నారు. అలాగే ప్రభుత్వ పోలీసు విభాగమైన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ)లో చేరబోమని స్పష్టం చేశామని ఆయన వెల్లడించారు.

## లొంగుబాటలో మరో మావోయిస్టు బండి ప్రకాష్..

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: విశ్వసనీయ సమాచారం ప్రకారం మావోయిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ తెలంగాణ డిజిపి ముందు లొంగిపోతున్నట్లు సమాచారం బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్. అశోక్, క్రాంతి.. స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి, ప్రకాశ్ తండ్రి సింగరేణి కార్మికుడు. 1984 మధ్య గోటు ద విలేజెస్ ఉద్యమం ద్వారా రాడికల్ సూడెంట్స్ నియన్ (RSU) తరపున పోరాడారు. ఆపై మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. అయితే అనారోగ్య కారణాలతో ఆయన లొంగిపోవడానికి సిద్దపడినట్లు తెలుస్తోంది. అన్నీ సవ్యంగా జరిగితే.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లేదా డీజీపీ లేకుంటే స్థానిక పోలీసుల ఎదుట బండి ప్రకాశ్ లొంగిపోతున్నట్లు విశ్వసనీయంగా సమాచారం.




## బాణసంచా విక్రయాల్లో అప్రమత్తంగా ఉండాలి

### వ్యాపారులకు సూచనలు చేసిన వరంగల్ సీపీ

అక్షర దర్బార్, హనుమకొండ: బాణసంచా విక్రయదారులు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. దీపావళి పండుగ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని విక్రయదారులతో శుక్రవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. బాణసంచా విక్రయాలు చేసేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అగ్నిమాపక విభాగం నుంచి ఎన్‌ఓసీ, స్థల యజమానుల నుంచి అనుమతి పత్రం అవసరమని తెలిపారు. పక్కా భవనాల్లో వ్యాపారం నిర్వహిస్తే భవన బ్లూ ప్రింట్ దరఖాస్తు చేయాలి. అగ్ని ప్రమాద నివారణకు ఇసుక, నీరు, ఇతర అగ్ని నిరోధక సాధనాలు అందుబాటులో ఉండాలి. వీలైనంత వరకు విశాలమైన ప్రదేశాల్లో వ్యాపారం నిర్వహించాలి. అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు, టాస్క్ ఫోర్స్ తనిఖీ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారులు సుదర్శన్ రెడ్డి, రేమాండ్ బాబు, శ్రీధర్ రెడ్డి, అదనపు డీసీపీ రవి, ఏఎస్పీలు శుభం, జితేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## పనుల్లో వేగం పెంచాలి

### - మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

అక్షరదర్బార్, తాడ్వాయి: మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మేడారం దేవాలయం ప్రాంగణ అభివృద్ధి పనుల మ్యాప్ ప్రకారం తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలను చేశారు. ప్రతి రోజు వచ్చే భక్తులకు ఆటంకం కలుగకుండా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వైద్య సేవలు మెరుగ్గా ఉండాలి

**- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్**

అక్షరదర్బార్, వేలేరు: వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వేలేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం( పీహెచ్ సీ), పీచరలోని ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వేలేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్యులు సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ గదిని తనిఖీ చేసి మందుల నిల్వలను పరిశీలించారు. మందులు సరిపోను నిల్వ ఉన్నాయా, ఎలా ఇండెంట్ చేస్తున్నారు, బీపీ, షుగర్, ఐరన్ పోలిక్ మాత్రలు ఇస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు ఎంతమంది వైద్య సేవల నిమిత్తం వస్తున్నారని, ఓపీ తోపాటు ప్రతిరోజు ఎన్ని టెస్టులు చేస్తున్నారని కలెక్టర్ ఆరా తీశారు. బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలు ప్రతిరోజు ఎంతమందికి చేస్తుంటారని తెలుసుకున్నారు. ఫార్మసీ, ఓపీ, అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది పనితీరు బాగుండాలని అన్నారు. ఫార్మసీలో సరిపోను మందుల నిల్వలను ఉంచాలన్నారు. పీచరలోని సబ్ సెంటర్ ను తనిఖీ చేసి సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. వేలేరు పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ మేఘన, తహసీల్దార్ కోమి ఉన్నారు.





# కోటగుళ్లకు పూర్వ వైభవం తెస్తాం

- అభివృద్ధి కోసం రూ.55 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఆలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతాం
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షరదర్బార్, గణపురం: కోటగుళ్లకు కాకతీయుల నాటి వైభవం తెస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర పురావస్తు మ్యూజియంల శాఖ డైరెక్టర్ అర్జున్ రావులతో కలిసి కోట గుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల సముదాయం పునరుద్ధరించి పూర్వ వైభవాన్ని తెచ్చి భావి తరాలకు అందిస్తామని అన్నారు. ప్రస్తుతం ఈ గుడుల అభివృద్ధికి రూ.55 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని, ఇంకా రూ.25 కోట్లు అవసరం ఉన్నాయని, డీపీఆర్ తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామన్నారు. నియోజకవర్గంలోని పాండవుల గుట్టలు, కొడవటంచ, బుగులోని వెంకటేశ్వర స్వామి క్షేత్రాలు, మైలారం గుట్టలకు నిధులు మంజూరు చేయించనున్నట్లు సత్యనారాయణరావు పేర్కొన్నారు. పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు



మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు భూపాలపల్లి నియోజకవర్గంలో అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కోటగుళ్ల సందర్శన అనంతరం మండల కేంద్రంలో రెడ్డి గుడిని సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. త్వరితగతిన రెడ్డిగుడి సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీలు ఇన్చార్జి నర్సింగ్ నాయక్ , నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ గాలానికి చిక్కిన మత్స్యశాఖ అధికారులు

అక్షరదర్బార్, హనుమకొండ: మత్స్యకార సంఘంలో సభ్యత్వానికి లంచం డిమాండ్ చేసిన ఇద్దరు మత్స్యశాఖ అధికారులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన హనుమకొండలో ములుగు రోడ్డులోని మత్స్య శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. మత్స్యకార సహకార సంఘంలో సభ్యత్వం నమోదు కోసం ఆ సంఘం అధ్యక్షుడిని జిల్లా మత్స్యశాఖ అధికారిణి నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ హరీష్ లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఇద్దరు అధికారులు శుక్రవారం బాధితుడి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

# జస్టిస్ గవాయ్ పై దాడి చేసిన నిందితులను శిక్షించాలి

అక్షర దర్బార్, నూగూరు (వెంకటాపురం): జస్టిస్ బి.ఆర్. గవాయ్పై దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ను కఠినంగా శిక్షించాలని, దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వాజేడు, వెంకటాపురం మండలాల ఇన్చార్జి వావిలాల స్వామి మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వేల్పుల



మల్లేష్, యాసం మహేష్, కోగిల మల్లికార్జున, యాసం రమేష్, వేల్పుల రాజు, చెన్నం గౌతం, పుల్లూరు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాక్షి ఎడిటర్‌పై కేసులు ఎత్తివేయాలి

**భూపాలపల్లిలో జర్నలిస్టుల నిరసన**

అక్షర దర్బార్, భూపాలపల్లి : ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ కూడలి వద్ద కాకతీయ ప్రెస్ క్లబ్ మరియు జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. నకిలీ మద్యం వ్యాపారంపై సాక్షి మీడియా వరుస కథనాలు ప్రచురించినందుకు ఎడిటర్‌పై విచారణ



పేరుతో మూడు రోజులుగా జరుగుతున్న పోలీసుల వేధింపులను వారు తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని, ధనుంజయ రెడ్డిపై విచారణను వెంటనే నిలిపివేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# బీసీ బంద్ ను విజయవంతం చేయాలి

అక్షర దర్బార్,టేకుమట్ల: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల ఆధ్వర్వంలో పిలుపునిచ్చిన బందును వ్యాపార, వాణిజ్య, విద్యా, ఉద్యోగ సంఘాల బీసీ నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు అధిక సంఖ్యలో స్వచ్ఛంగా పాల్గొని విజయవంతం చేయాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టేకుమట్ల మండల కేంద్రంలో శుక్రవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ బీసీ నాయకులతో సమావేశమయ్యారు. కేంద్రంలో బీజేపి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉండి బీసీలను ఓటు బ్యాంక్ గా తమ అవసరాలకు వాడుకుని తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయబద్ధమైన బీసీల రిజర్వేషన్ని రెండు పార్టీలు చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు..



# కుంకుమేశ్వరాలయంలో వైభవంగా పూజలు

అక్షర దర్బార్, పరకాల: శుక్రవారం ఉదయం పరకాల కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మశ్రీ కోమలపల్లి సంపత్ కుమార్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించబడ్డాయి. 108 పుణ్య నదుల జలాలతో ఆలయంలో పూజలు జరిపిన అనంతరం, యాత్రా శోభాయాత్రగా మెయిన్ రోడ్ గుండా ప్రయాణించి, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దర్శనం అనంతరం మహా రుద్రయాగ స్థలానికి చేరుకున్నారు.యాగశాల వద్ద భక్తుల సమక్షంలో అర్చకులు, వేద పండితులు పుణ్య నదీజలాలతో సంప్రోక్షణ చేసి, యాగ ప్రారంభానికి శుభ సంకేతం ఇచ్చారు.

# బీసీ జేఏసీ బంద్ ను విజయవంతం చేయండి

**పరకాల బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్**



అక్షర దర్బార్, పరకాల: బీసీలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు మేరకు పరకాల మండల కేంద్రంలో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బిజెపి పరకాల పట్టణ అధ్యక్షుడు గాజు నిరంజన్ పేర్కొన్నారు.ఈ బంద్ లో స్వచ్ఛందంగా వ్యాపారస్తులు, విద్యావంతులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# దుగ్గొండి బీసీ జేఏసీ చైర్మన్ గా బండారి ప్రకాష్



అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండల బీసీ జేఏసీ చైర్మన్‌గా బండారి ప్రకాష్ ముదిరాజ్ నియామకమయ్యారు. బీసీ జేఏసీ చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కడారి సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పొన్నాల మహిపాల్, డ్యాగం శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారి ప్రకాష్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన జాజుల శ్రీనివాస్ గౌడ్, వడ్లకొండ వేణుగోపాల్, డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, కడారి సురేష్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



# సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**పత్తి రైతుల రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి**

అక్షర దర్బార్, దుగ్గొండి : పత్తి రైతుల ప్రయోజనార్థం సీసీఐ కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ పత్తి రైతుల రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దుగ్గొండి మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన పత్తికి సరైన మద్దతు ధర లభించడం లేదని, వ్యాపారస్తులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు రూ.10వేలు మద్దతు ధర అమలు చేయాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.7,700 ధరను కూడా వ్యాపారస్తులు అమలు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి పత్తి దిగుబడులు తగ్గాయని, అయినా రైతులకు సరైన ధర దక్కడం లేదని తెలిపారు. మార్కెట్లో తేమ పేరుతో ధరలు తగ్గించడం అన్యాయం అని పేర్కొన్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటు వలన రైతులకు సరైన ధర లభించి, నష్టం తగ్గుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొరబోయిన కుమారస్వామి, జిల్లా నాయకులు కటుకూరి శ్రీనివాసరెడ్డి, కోడం రమేష్, కొంగర నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు

**మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి**

అక్షర దర్బార్, చిట్యాల : పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో పత్తి కొనుగోళ్లపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కపాస్ కిసాన్ స్లాట్ బుకింగ్ చేసుకొని సమీప మిల్లుల వద్ద పత్తి విక్రయించుకోవాలని, పంట నమోదుతో పాటు ఆధార్‌ను బ్యాంక్ ఖాతాతో లింక్ చేసుకోవాలని సూచించారు. దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి లా. షరీఫ్, సూపర్వైజర్ రాజేందర్, రైతు సోదరులు పడిదెల దేవేందర్, అల్లం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు అందుబాటులో ఉండాలి

**డీఎంహెచ్ఓ డా. అప్పయ్య**

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం హనుమకొండ జిల్లా డీఎం హెచ్ఓ డాక్టర్ అప్పయ్య పరిశీలించారు. ఆరోగ్య కేంద్ర నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఇన్ పేషెంట్ వార్డును, బ్లడ్ బ్యాంకును, డయాబెటిస్ రక్తపోటు వ్యాధిగ్రస్తుల సేవల రికార్డులను పరిశీలించారు. టిబి ముక్త్ భారత్ ప్రోగ్రాం లో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తుల మందులను అందుబాటులోకి తీసుకోవాలని హాస్పిటల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పరకాల హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహన్, ఆర్ ఎం ఓ డాక్టర్ బాలకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# అవినీతి, నేర ధన రాజకీయాలతో
# సంక్షోభంలో ప్రజలు

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్
- మాజీ ఎమ్మెల్యే ఓంకార్ కు నివాళి




అక్షర దర్బార్, నర్సంపేట : ప్రస్తుత రాజకీయాలు అవినీతి, నేర ధన రాజకీయాలకు కేంద్రమై ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. శుక్రవారం నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే, అమరజీవి, అసెంబ్లీ టైగర్ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 17వ వర్ధంతి సందర్భంగా ఓంకార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఓంకార్ భవన్ లో "కమ్యూనిస్టుల పాత్ర" అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ.. నేటి రాజకీయాలు నీతి, నిజాయితీ, త్యాగాల విలువలు కోల్పోయాయని అన్నారు. అధికారమే లక్ష్యంగా ప్రజలను మభ్య పెడుతున్న నాయకులు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. కామ్రేడ్ ఓంకార్ ఆలోచనలతో ప్రజా ఉద్యమాలను నిర్మించడం అత్యవసరమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుండెబోయిన చంద్రయ్య, ప్రజానాట్య మండలి కార్యదర్శి కన్నం వెంకన్న, మహిళా సంఘం కార్యదర్శి వంగల రాగసుధ, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబురావు, నాగెల్లి కొమురయ్య, కొత్తకొండ రాజమౌళి, సింగతి మల్లికార్జున్, కేశెట్టి సదానందం, దామ సాంబయ్య, ఎల్లబోయిన రాజు, అల్లి సాబ్, సీతా రాములు, మహమ్మద్ మాశూక్, మార్త నాగరాజు, జన్ను రమేష్, బుడిమే సురేందర్, సిరి బొమ్మల భాస్కర్, కర్నే సాంబయ్య, గీసపాక కొమురయ్య, తడుక కౌసల్య, మార్త సుధా, మొర్రి శ్రీను, రాకేష్, సాగర్, అజయ్, రాజు, భాస్కర్, చేరాలు పకిడ చంద్రరావు, ఐలుకొమురు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు పంపిణీ

**మొరంచపల్లిలో ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్సార్**

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లాలో పశువుల గాలికుంటు వ్యాధి నివారణార్థం నిర్వహిస్తున్న ఉచిత టీకా కార్యక్రమాన్ని మొరంచపల్లి గ్రామంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం రైతు కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి కీలకమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆవులు, గేదెలు, దూడలు, ఎద్దులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నవంబర్ 14 వరకు కొనసాగుతుందని చెప్పారు. పాడి రైతులు, రైతు సోదరులు తమ పశువులకు తప్పక టీకాలు వేయించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వెటర్నరీ & అనిమల్ హస్బండ్రీ ఆఫీసర్ కుమారస్వామి అసోడా, అసిస్టెంట్ డైరెక్టర్లు టీ. గోపాలకృష్ణమూర్తి, జి. వెంకన్న, పశువైద్యులు డా. జె. తిరుపతి, డా. ఎస్. బాలకిషన్, డా. బి. రాజబాబు, డా. కె. ప్రశాంత్, గోపాలమిత్ర సూపర్వైజర్ ప్రకాశ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ చాద రఘునాథ రెడ్డి, ఎక్స్-ఎంపీటీసీ ఎన్. నర్సింహారెడ్డి, ఎక్స్-సర్పంచ్ ఎల్. వెంకన్న, పశువైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అరుణ ఫర్టిలైజర్స్ సందర్శించిన ఎన్ఎఫ్ఎల్ ప్రతినిధులు



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో శుక్రవారం అరుణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్, షాపును ఎన్ఎఫ్ఎల్ ఎరువుల కంపెనీ ప్రతినిధులు ఆర్ఎం వంశీకృష్ణ, సేల్స్ ఆఫీసర్ శ్రీధర్ పరిశీలించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకి యూరియాని సమృద్ధిగా పంపిణీ చేస్తున్న ఎన్ఎఫ్ఎల్ కంపెనీ ప్రతినిధులను రైతులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# ఉన్నత లక్ష్యాలతోనే ఉన్నత శిఖరాలకు



అక్షర దర్బార్, ఖానాపూర్ : ఉన్నత లక్ష్యాలతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం ఖానాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూమ్, భోజన నాణ్యత, వంట గది, సౌకర్యాలు పరిశీలించారు. భోజన రుచి, మెనూ ఖచ్చితంగా పాటించబడుతుందా అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల వాకబులరీ పెంపు కోసం వారంలో ఒక రోజు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ డేగా ఆ భాషలోనే మాట్లాడాలని సూచించారు. అలాగే, క్రీడల కొరకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖో-ఖో కోర్టులు ఏర్పాటు చేయాలని అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, టీఈడబ్ల్యూఐడీసీ డీఈ అశోక్, జీఈసీఓ ఫ్లోరెన్స్, ఎంఈఓ శ్రీదేవి, స్పెషల్ ఆఫీసర్ మేనక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవాలయ భూమి... దేవాలయానికే!

**పరకాల శివయ్యకు న్యాయం జరిగింది..**






అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన శ్రీ భవాని కుంకుమేశ్వరాలయానికి చెందిన భూమిపై గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న ఆక్రమణ యత్నాలకు తాజాగా ముగింపు పలికింది. హనుమకొండ అదనపు కలెక్టర్ ఇచ్చిన అధికారిక ప్రొసీడింగ్ ప్రకారం, భూమి సర్వే నంబర్ 991 లోని 4.11 ఎకరాల భూమి దేవస్థానానికి చెందినదేనని ప్రకటించారు. ఈ ప్రకటనతో ఆలయ కమిటీ, పరకాల ప్రజలు సంతోషంతో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఆలయ భూమిని కాపాడిన కుంకుమేశ్వర ఆలయ కమిటీకి భక్తులు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చిన్న కాళేశ్వరం భూసేకరణ వేగవంతం చేయాలి

## అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం

అక్షర దర్బార్, భూపాలపల్లి : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులు, అలాగే మెగా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. భూ సేకరణ, మ్యుటేషన్, పరిహార చెల్లింపులు మరియు ప్రాజెక్టు పనుల పురోగతిపై శాఖల వారీ సమన్వయం చేపట్టి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పారదర్శకంగా భూ సేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే, ఫీల్డ్ స్థాయి సమస్యలను సమీక్షించి తక్షణమే పరిష్కరించాలని కూడా ఆయన ఆదేశించారు.




# బంద్ కు బీజేపీ సంపూర్ణ మద్దతు



అక్షర దర్బార్ శాయంపేట : బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ బంద్ కు బీజేపీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మండల అధ్యక్షుడు నరహరి శెట్టి రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. శనివారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్ కు అన్ని వర్గాల ప్రజలు, పాఠశాలలు, కాలేజీలు పెట్రోల్ బంకులు ఇతర వాణిజ్య వ్యాపార సముదాయాల ప్రజలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# రేపు రాష్ట్ర బంద్

- హైదరాబాద్ లో అఖిల పక్ష, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ముందస్తు ర్యాలీ
- పార్టీలు, సంఘాలకు అతీతంగా బంద్ కు మద్దతు ఇవ్వాలని పిలుపు



అక్షరదర్బార్, హైదరాబాద్: స్థా నిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా శనివారం తెలంగాణ బంద్‌కు బీసీ సంఘాల ఐకాస పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో బంద్‌కు మద్దతుగా అఖిలపక్ష, బీసీ సంఘాలు శుక్రవారం హైదరాబాద్‌లో ముందస్తు సంఘీభావ ర్యాలీ నిర్వహించాయి. బషీరాబాగ్ కూడలి నుంచి ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. బీసీ ఐకాస చైర్మన్ ఆర్ కృష్ణయ్య, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బీసీ ఐకాస వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. జనాభాలో సగభాగానికి పైన ఉన్న బీసీలకు తప్పకుండా రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. శనివారం జరిగే తెలంగాణ బంద్‌లో పార్టీలు, సంఘాలకు అతీతంగా శ్రేణులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# బీసీ కోటా అంశంపై ప్రభుత్వానికి లేఖ రాశాం!

- ప్రభుత్వం మరోసారి కోటాను ఖరారు చేయాల్సి ఉంది..
- హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం
- ప్రభుత్వానికి రెండు వారాల గడువిచ్చిన న్యాయస్థానం




అక్షరదర్బార్, హైదరాబాద్: స్థా నిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటా అంశంపై తాము రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది విద్యాసాగర్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా న్యాయస్థానం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై శుక్రవారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నిక లు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని గత విచారణ సందర్భంగా ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేశామని రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు గుర్తుచేశారు. ప్రభుత్వం రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ కూడా రాశామని, సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి మూడు వారాల సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఈక్రమంలో ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు రెండు వారాల గడువు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# పర్లపల్లి లో కార్డన్ సెర్చ్

## గుడుంబా స్వాధీనం, ద్విచక్ర వాహనాలు సీజ్



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: శాంతిభద్రతలలో భాగంగా, ప్రజలకు భరోసా కల్పించేందుకు శుక్రవారం మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు చిట్యాల ఇన్స్పెక్టర్ డి మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ. పర్లపల్లి గ్రామంలో పోలీస్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించి కాగితములు సక్రమంగా లేని మోటార్ సైకిళ్లు, గుడుంబా,ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనుమానితుల ఇళ్లను, వ్యక్తులను, రౌడీషీటర్ల, నేర చరిత్ర కల్గిన వారి ఇళ్లను పరిశీలించినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలపాలైన గంజాయి, గుట్కా, మట్కా, అక్రమ మద్యం, నాటుసారా జూదం వంటి వాటిని ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ గ్రామంలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని సిఐ మల్లేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి ఎస్సై బి అశోక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ బిల్లులు విడుదల చేయాలి



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు విడుదల చేయాలని బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో ఫణి చంద్రకు వినతిపత్రం ద్వారా తెలియజేయడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ బిల్లులు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బిల్లులు అందించాలనికోరారు. కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్,బహుజన సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు మారపేల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారా భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- మహబూబాబాద్ లో భవన్ నిర్మాణంపై ఎమ్మెల్యే మురళి నాయక్ వినతి
- సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి



అక్షర దర్బార్, హైదరాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి కృషి జరుగుతోంది. ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్లో బంజారా నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా కేంద్రంలో భవనం నిర్మించడానికి మున్సిపల్ పరిధిలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, దాని నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని నరేందర్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నరేందర్ రెడ్డిని కలిసిన వారిలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బానోత్ నెహ్రూ రాథోడ్, కున్సోత్ హాట్య నాయక్, దారవత్ స్వామి, దారవత్ భాస్కర్, బోడ హరిలాల్ ఉన్నారు.

# జాగృతిని బలోపేతం చేస్తాం




అక్షర దర్బార్ శాయంపేట : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను శుక్రవారం రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణ స్థాయిలో జాగృతిని బలోపేతం చేయడంలో నా వంతు కృషి చేస్తానని అదేవిధంగా "జాగృతి" చేపట్టబోయే కార్యక్రమాలను ముందుండి విజయవంతం చేస్తానని ప్రజల్లో జాగృతిపై అవగాహన కల్పించి, జాగృతి చేసే కార్యక్రమల్లో ముందుండి నడిపిస్తానని తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915